క్లుప్తంగా

పోలీసు కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం



చెక్కు అందిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు: పోలీసు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. ఏఆర్‌లో విధులు నిర్వహిస్తూ 2022 సెప్టెంబర్ 14న అనారోగ్యంతో కె.నాగేశ్వరరావు మృతి చెందారు. ఈ సందర్భంగా అతని భార్య కె.అచ్చమ్మకు వితంతు నిధి కింద రూ. 50వేలు చెక్కును ఎస్పీ గురువారం తన చాంబరులో అందించారు. ఏదైనా సమస్య ఉంటే తనను నేరుగా కలవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరితగతిన వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. పోలీసు కార్యాలయ ఏవో యం.సులోచన పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల తనిఖీ



పెట్రోలు నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు

మద్దిపాడు: మండల పరిధిలో ఉన్న పెట్రోలు బంకుల్లో తహసీల్దార్ లక్ష్మీనారయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ నాణ్యత పరిశీలించారు. సయజమానుల లైసెన్సులు చూశారు. బంక్ ఆవరణలో ఉన్న స్టాక్ బోర్డు మంచి నీటి సౌకర్యం, పైప్, టాయిలెట్లు, అగ్నిమాపక యంత్రాలు, జనరేటర్ వంటి సౌకర్యాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామకృష్ణ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీ చేయాలి



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి వెంకటస్వామి

నాగులుప్పలపాడు: మండలంలో మెదలు కానున్న 14వ విడత సామాజిక తనిఖీని ప్రతి ఒక్కరూ నిర్వహించాలని డ్వామా విజిలెన్స్ జిల్లా అధికారి వెంకటస్వామి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం, ఫీల్డు అసిస్టెంట్‌లకు జరిగిన అవగాహన సమావేశంలో పలు సూచనలు చేశారు. శుక్రవారం నుంచి గ్రామ పంచాయతీలో ఈ తనిఖీలు జరుగుతాయని గత ఏడాది జరిగిన పనులకు సంబంధించి ప్రతి అంశాన్ని పరిగణనలోనికి తీసుకొంటామన్నారు. ఎంపీడీవో ఏ.వి.కుమారి, ఏపీవో ధనుంజయ్, ఎస్ఆర్‌పీ, సిబ్బంది ఉన్నారు.

యోగా శిక్షణ తరగతులు



సీహెచ్‌ఓలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న డాక్టర్ మానస

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు పరిధిలో ఉన్న అన్ని విలేజ్ హెల్త్ సెంటర్‌లకు సంబంధించిన సీహెచ్‌ఓలకు మద్దిపాడు పీహెచ్‌సీలో రెండు రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ మానస తెలిపారు. గ్రామాల్లో దైనందిన జీవితంలో ఆహారపు అలవాట్ల వలన మానసికంగా దృఢంగా లేకపోవడం వలన షుగర్, బీపీలు ఎక్కువగా వస్తున్నాయని ఇకపై విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో ప్రతి శనివారం ప్రజలకు గ్రామాల్లోని హెల్త్ క్లినిక్‌లలో యోగా శిక్షణ ధ్యానం తరగతులు నిర్వహించాలని దీనివలన బీపీ షుగర్‌లను అదుపులో ఉంచవచ్చని తెలిపారు. 16,17 తేదీల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌ఓలకు తరగతులు నిర్వహిస్తున్నామని డాక్టర్ తెలిపారు.

రీసర్వే పూర్తి కాకపోతే చర్యలు

● సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ హెచ్చరిక



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు: రీ సర్వే సకాలంలో పూర్తికాకపోతే చర్యలు తప్పవని పెళ్లూరు సచివాలయ ఉద్యోగులను ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం పెళ్లూరు సచివాలయాన్ని సందర్శించి రీసర్వే వివరాలను పరిశీలించారు. జగనన్న భూహక్కుభూరక్ష పథకంలో భాగంగా సచివాలయ పరిధిలో ఉన్న మొత్తం 533 అసైన్మెంట్లకు సంబంధించి 526 పూర్తి అయినట్లు గుర్తించారు. మిగిలిన అసైన్మెంట్లు కూడా గురువారం నాటికి పూర్తిచేయాలన్నారు. ఆర్‌డీఎంఏ ప్రతిరోజూ దీనిపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని చెప్పారు. పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న విషయాలను సచివాలయ ఉద్యోగులకు వివరించారు. రీసర్వే పూర్తికాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుటామని స్పష్టం చేశారు. కమిషనర్ రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్నా సమావేశాలకు హాజరుకాని వలంటీర్లను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న ఎస్‌డీజీ సర్వే, పీఎం–జేఏవై సర్వే పురోగతి గురించి సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. వేగవంతంగా పూర్తి చేయలేకపోతుండడానికి గల కారణాలపై రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. పీఎం జేఏవై పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా గురించి ప్రజలకు వివరించాలని, పెండింగ్ సర్వేని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈనెల 18 నాటికి పీఎంజేఏవై, ఎస్‌డీజీ సర్వేలు పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి, వలంటీర్లను ఆదేశించారు. క్లాప్ పథకంలో భాగంగా వసూలు చేస్తున్న యూజర్ ఫ్రీ కలెక్షన్స్, పారిశుద్ధ్య పనులు, మూడు బుట్టల ద్వారా చెత్తసేకరణ విధానంపై సమీక్షించి పలు సూచనలు చేశారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయడం, కాలువల పూడిక తీత పనులపై దృష్టి సారించాలని శానిటరీ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి వసూలుకాని పెండింగ్‌లో ఉన్న ఇంటిపన్ను, కుళాయి పన్ను గురించి ప్రత్యేకంగా సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. పెళ్లూరు సచివాలయ పరిధిలో మొత్తం రూ. 28.49 లక్షలు వసూలు కావాల్సి ఉండగా ఇంకా రూ. 17.52 లక్షలు వసూలు కావాల్సి ఉన్నట్లు గుర్తించారు. సచివాలయ పరిధిలో ఉన్న సదరన్ గ్రానైట్స్, క్లబ్ స్క్వేర్ యజమానులతో కమిషనర్ నేరుగా పన్ను బకాయిల విషయపై మాట్లాడడంతో వారు పది రోజుల్లోగా క్లియర్ చేస్తామని పేర్కొన్నారు. అధిక పన్నులు చెల్లించాల్సిన వారందరికీ వెంటనే రెడ్ నోటీసులు ఇవ్వాలని, అదే విదంగా కుళాయి పన్ను వెంటనే కట్టించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అధిక మొత్తం బకాయి ఉండి, సిబ్బందితో దురుసుగా మాట్లాడిన వారి కుళాయి కనెక్షన్ తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వెంకటశేషయ్య, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగాధినేత కె.వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ డీఈ పద్మజ, ఆర్ఐ శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యం

● జిల్లా క్షయ వ్యాధినివారణ అధికారి డాక్టర్ సురేష్



బ్యాగులను టీబీ రోగులకు పంపిణీ చేస్తున్న డాక్టర్ మానస, డాక్టర్ సురేష్

మద్దిపాడు: క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తి గా నిర్మూలించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిల్లా క్షయ వ్యాధినివారణ అధికారి డాక్టర్ సురేష్ అన్నారు. గురువారం ఆయన మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు 700 రూపాయల విలువైన పోషక విలువలు కలిగిన తినుబండారాలు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నయం చేయగలిగిన వ్యాధి అని కేంద్ర ప్రభుత్వం క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభయాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రారంభదశలోనే గుర్తించి నట్లయితే వారికి చికిత్స సులువు అవుతుందని చెప్పారు. తరచూ దగ్గుతూ ఉండేవారు పరీక్షలు చేయించుకోవాలని సూచనలు చేయాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణకు బయట రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుందని కానీ ప్రభుత్వం అన్ని పీహెచ్‌సీలలో ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామన్నారు. క్షయ వ్యాధి సోకిన వ్యక్తి మొదటి రెండునెలల వరకూ జాగ్రత్తగా మందులు తీసుకుంటూ, మాస్కు ధరించి బయటకు వెళ్లాలని ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదన్నారు. అనంతరం ఆసుపత్రి డాక్టర్ మానస చేతుల మీదుగా 17 మంది రోగులకు కిట్లు పంపిణీ చేశారు. మద్దిపాడు టీబీ యూనిట్ అధికారి చంద్రమౌళి, భవ్య ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ లలితమ్మ, పీహెచ్‌ఎన్ రజిత కుమారి, ఎంపీహెచ్‌ఈఓ వెంకారెడ్డి, ఎంపీహెచ్ఎస్ బాలకోటయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్



సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిశీలిస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మేయర్ గంగాడ సుజాత

● నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: వేసవిలో ఒంగోలు నగర ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడకుండా తగు చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగానే నేడు రామతీర్థం రిజర్వాయర్ నుంచి ఒంగోలు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నీరు విడుదల అవుతుందనగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. గురువారం మున్సిపల్ అధికారులతో కలిసి రామతీర్థం రిజర్వాయర్‌నుంచి విడుదల అవుతున్న నీటి పరిమాణాన్ని, మార్గమధ్యంలో మున్సిపల్ అధికారులు అవి ఎక్కడా దారి మళ్లకుండా తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అనంతరం ఒంగోలు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులతోపాటు రంగారాయుడు చెరువును కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మీడియాతో మాట్లాడుతూ గతంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీరు లేక క్రీడలు ఆడుకున్న పరిస్థితులు ఉండేవన్నారు. కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సకాలంలో వర్షాలు పడుతూ ఏనాడు తాగునీటి ఎద్దడి సమస్యలేకుండా పోయిందన్నారు. తాజాగా బాలినేని శ్రీనివాసరెడ్డి నగర తాగునీటి సమస్యపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించారని, ప్రస్తుతం చెరువులలో ఉన్ననీరు మే నెలవరకు సరిపోతుందన్నారు. మే నెలలో మరోమారు రామతీర్థం రిజర్వాయర్‌నుంచి నీటి విడుదల ఉంటుందని తద్వారా వేసవిలో తాగునీటి సమస్య ఉండదన్నారు. శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి మంజూరు చేయించిన రూ. 339 కోట్లకు త్వరలో టెండర్లు పిలవడం జరుగుతుందని, తద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

ఉగాది వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ

శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక కాపు కళ్యాణ మండపంలో నిర్వహించనున్న శోభకృత్ నామ ఉగాది వేడుకల బ్రోచర్‌ను నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత గురువారం తన చాంబరులో ఆవిష్కరించారు. తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఉగాది గత రెండు దశాబ్దాలుగా శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి నిర్వహించడం అభినందనీయం అంటూ అధ్యక్షుడు కుర్రాప్రసాద్‌ను అభినందించారు. కుర్రాప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి పంచాంగ శ్రవణంతో కార్యక్రమం ప్రారంభం అవుతుందని, కవి సమ్మేళనం, నెల్లూరుకు చెందిన జాదూగర్ టైగర్ మొహమ్మద్‌చే అపూర్వ ఇంద్రజాల ప్రదర్శన, చందు డాన్స్ అకాడమీవారిచే వినూత్న సాంస్కృతిక నృత్యప్రదర్శనలు ఉంటాయన్నారు. అంతే కాకుండా కుర్రా కోటి సూర్యమ్మ స్మారక పురస్కార ప్రదానోత్సవాన్ని డాక్టర్ బులుసు అపర్ణకు, ఉగాది పురస్కారాలను గాడేపల్లి దివాకరదత్తు, మాగులూరి నాగేశ్వరరావు, షేక్ మొహమ్మద్, మారేపల్లి సూర్యకుమారి, గొల్లపూడి శ్రీహరి, నూకతోటి శరత్‌బాబు, పతకమూరి సాంబయ్య, కుమారి కొమ్మాల యశస్విని తదితరులకు అందించనున్నట్లు తెలిపారు. సమితి గౌరవాధ్యక్షులు గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లిఖార్జునరావు, పి.గోవర్ధన్‌రెడ్డి, వల్లెపు మురళి, కుర్రా విజయ్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



ఉప్పుగుండూరులో నివాళులర్పిస్తున్న వాసవిక్లబ్ ప్రతినిధులు, గ్రామస్తులు



వాణిజ్యపన్నులశాఖ కార్యాలయంలో..



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ గురువారం జిల్లాలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వాణిజ్యపన్నులశాఖ కార్యాలయంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారి దుంపా ఝాన్సీ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు చెన్నమనేని శ్రీనివాసరావు నేతృత్వంలో, స్థానిక కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఉప కమిషనర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

నాగులుప్పలపాడు: ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్ బాబు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఉప్పుగుండూరులో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సామాజిక కార్యకర్త తెలగతోటి శామ్యూల్ మాట్లాడుతూ అమరుల త్యాగాలతో ఏర్పడిన ఈ రాష్ట్రంలో వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పార్కు సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. పులకణం రాజేష్, ప్రసాద్, దేసు రవి సుధాకర్, ఆత్మకూరి వాసు, గ్రామస్తులు ఉన్నారు.



స్థానిక కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న అధికారులు

చీమకుర్తి: అమర జీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాసవీక్లబ్, మహిళాక్లబ్ ఆర్యవైశ్య కల్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంతనూతలపాడులో ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. వాసవీక్లబ్, మహిళాక్లబ్, ఆర్యవైశ్య కల్యాణ మండపం నాయకులు జి.బదరీనారాయణ, పద్మజ, పి.ఆంజనేయులు, సత్యనారాయణ, ప్రసాదరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్: ఆంధ్రరాష్ట్ర సాధకుడు అమరవీరుడు పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవం రూరల్‌లోని కరవది పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘ నాయకులు వాసవిక్లబ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలల విద్యార్థులకు అల్పాహారాన్ని, క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పేరకం సుబ్బారావు, గాదెంశెట్టి జ్వాలారావు, ఎస్వీ నారాయణ, పి.శ్యామ్‌బాబు, పి.సుకుమార్, పి.మల్లిఖార్జున, పి.శ్రీనివాసరావు, బద్రీనాథ్, మధు, సత్యం, పేరకం మల్లి, సుదీర్, రాజా, చరణ్‌సింగ్ పాల్గొన్నారు.



కరవదిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

ఒంగోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు అని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక తన నివాసంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కృషిచేసిన మహనీయుడుగా కొనియాడారు.

ప్రకృతి వ్యవసాయం మిన్న



ర్యాలీలో మాట్లాడుతున్న ఎల్–2 రాధా శింగమనేని

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం లాభసాటి వ్యవసాయం అని ఎల్–2 రాధా శింగమనేని రైతులకు తెలిపారు. గురువారం రూరల్ లోని ఉలిచి గ్రామంలో రైతు సాధికారిక సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ విభాగం వారు ప్రీమ్యాన్ డే సోయింగ్ ర్యాలీ నిర్వహించారు. 30 రకాల విత్తనాలతో ప్రీమ్యాన్ డ్రై సాయింగ్ చేసేటప్పుడు విత్తనాలను విత్తన గుళికలుగా చేసుకుని బీజామృతం, ఘనజీవామృతం, బంకమట్టి, బుడిదలలో మూడు లేయర్లుగా విత్తన గుళికలుగా చేసుకోవాలన్నారు. ఇలా చేసుకున్న విత్తనాలను పొలంలో చల్లుకోవడం ద్వారా పొలంలో వర్షం పడిన వెంటనే మొలక రావడం జరుగుతుందన్నారు. 365 రోజులు భూమిని కప్పి ఉంచడం ద్వారా రైతులకు చక్కని వరం లాంటిదని ఎల్–2 రాధా శింగమనేని అన్నారు.సిబ్బంది ఎల్–2 రాధా తో పాటు నరసింహులు, రెడ్డిప్ప, పద్మావతి, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నగర ప్రశాంతతకు కారణం బాలినేని



మాట్లాడుతున్న కటారి రామచంద్రరావు, ఘనశ్యాం, వేమా శ్రీనివాసరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, అంగలకుర్తి రవి

ఒంగోలు: నగరం నేడు ప్రశాంతంగా ఉందంటే అందుకు కారణం శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడి చర్యలే కారణమని ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1987 నుంచి 1990 మధ్యలో రాత్రి 7గంటలు అయిందంటే చాలు రోడ్డుమీద ఒక్కరు ఉండేందుకు సైతం భయపడేవారన్నారు. అటువంటి పరిస్థితి నుంచి నగరంలో నేడు అర్ధరాత్రి సైతం ప్రశాంతంగా ప్రజలు సంచరించగలగుతున్నారంటే అందుకు కారణం బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. అయిదు సార్లు ఎంఎల్‌ఏగా, రెండు సార్లు మంత్రిగా తీసుకున్న చర్యలే కారణమన్నారు. ఈనెల 13న స్థానిక సెయింట్ థెరెస్సా వద్ద టీడీపీ కార్యకర్త చొక్కా తీసి తొడ చరుస్తూ మీసాలు మెలేయడాన్ని ఏమంటారో ప్రజలకు చెప్పాలన్నారు. అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా తాను ఉన్న సమయంలో రూ. 1.50 కోట్లు ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం చార్మినార్ బ్యాంకులో డిపాజిట్ చేయడం జరిగిందని, దానికి మరలా వడ్డీతో కలుసుకుని అర్బన్ బ్యాంకుకు రూ. 4.50కోట్లు నిధులు జమకావడం జరిగిందన్నారు. అప్పట్లో సహకారరంగంలో ఉన్న కృషి బ్యాంకు, చార్మినార్ బ్యాంకు, మహేష్ బ్యాంకు వంటివి దివాలా అంచుకు చేరడంతో ఒంగోలు అర్బన్ బ్యాంకుపై కూడా తీవ్ర ప్రభావం పడిందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం మానుకోవాలని టీడీపీ నాయకులకు హితవు పలికారు.

గొర్రెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను మున్సిపల్ చైర్మన్ పదవికోసం పోటీపడినప్పుడు తన గెలుపుకోసం బాలినేని ఎంతగా కృషిచేశారో తమందరికీ తెలుసని, కాకుంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండి నాలుగుసార్లు ఒంగోలు వచ్చి చేపట్టిన ఒత్తిడి కారణంగానే నాడు తాను ఓటమిపాలయ్యానన్నారు. ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు మాట్లాడుతూ వ్యక్తిత్వం అనేది పుట్టుకతో వస్తుందన్నారు. అంగలకుర్తి రవి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇ– కేవైసీపై సామాజిక తనిఖీ

చీమకుర్తి: రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన ఈ కేవైసీ నమోదులో మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. సంతనూతలపాడు మండలం బొడ్డువారిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం స్థానిక రైతులతో కలిసి ఏర్పాటు చేశారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు చెందిన ఈ క్రాప్ నమోదులో కేవైసీ జాబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ కేవైసీ జాబితాలో రైతుల పేర్లలో తప్పులు ఉంటే సరిచేసుకోవానికి మరొక అవకాశం కల్పించామని ఏఓ పావని తెలిపారు. ఈ కేవైసీ నమోదు వలన రైతులు సాగు చేసే పంటలలో నష్ట పరిహారం పొందటానికి, ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందటానికి, కొనుగోలు కేంద్రాలలో పండించిన ఉత్పత్తులను విక్రయించటానికి దోహదపడుతుందని రైతులకు తెలిపారు. ఈ అవకాశాలను మండలంలోని రైతులంతా వారి వారి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించిన జాబితాలను పరిశీలించుకొని తప్పులను సరిచేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వివరాలు సరిచూసుకోండి

ఒంగోలు రూరల్: ప్రకాశం జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసులు గురువారం రూరల్ లోని పలు ప్రాంతాల్లో జరిగిన గ్రామసభల్లో ఆకస్మికంగా పరిశీలన జరిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో హాజరయ్యారు. ఒంగోలు మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో శ్రీనివాసులు మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు తమ వివరాలను సరిగా ఉన్నాయో లేవో లిస్ట్ లో చెక్ చేసుకోవాలన్నారు. తప్పులు పొరపాట్లు ఉంటే అవి 17న సరి చేసి తుది జాబితాను ఈ నెల 20న ప్రచురిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ముక్తినూతలపాడులోని పొగాకు పంటను పరిశీలించారు. ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో చిరు ధాన్యాలు సాగు చేసుకోవాలని తెలిపారు. సభలో ఏ.ఏ బి.రవిచంద్ర, పంట నమోదు చేసిన జాబితాను చదివి వినిపించారు. ఏఈవో రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, గ్రామ రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు



ధాన్యాన్ని కొనుగోలు చేయడాన్ని పరిశీలిస్తున్న ఏవో మోహన్‌రెడ్డి

కొత్తపట్నం: రైతు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ శాఖ ఏవో మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రారంభించామని, రైతుకు అనుకూలంగా గిట్టుబాటు ధర ఇస్తుందని చెప్పారు. వర్షాలు విపరీతంగా పడటం వలన ధాన్యం దిగుబడి అధికంగా పెరిగి రైతుకు లాభం చేకూరిందన్నారు. ప్రయివేటు వ్యాపారస్తుల కంటే ప్రభుత్వం అధిక ధర కల్పిస్తుందన్నారు. ఇప్పటికే ఎన్ఎల్ఆర్ 3354, ఎన్ఎల్ఆర్ 4001 రకం 1500 క్వింటాల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. క్వింటా బ్యాగ్ ధర రూ.2,060 చెల్లించడం జరుగుతుందన్నారు. ఏ గ్రేడ్ ఉన్న ధాన్యానికి రూ.20 అదనంగా చెల్లిస్తామన్నారు. మార్కెటింగ్ కమిటీ కొనుగోలు చేసి నగదును వారి అకౌంట్‌లో జమచేసే ప్రక్రియ జరుగుతుందన్నారు. ధాన్యం పండించిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందిని కలుసుకుని బుకింగ్ చేసుకోవాలని సూచించారు.